ప్రజాశక్తి
శుక్రవారం 5 జనవరి 2024
5
శ్రీకాకుళం

శాశ్వత లోక్‌అదాలత్‌తో ఉచిత న్యాయ సహాయం

శ్రీకాకుళం అర్బన్ : ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా ఉచితంగా న్యాయ సేవలు అందించడమే లోక్ అదాలత్ లక్ష్యమని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు అన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి, స్త్రీలు, పిల్లలు, వికలాంగులు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన వారికి ఎటువంటి ఖర్చు లేని సత్వర న్యాయ పరిష్కారం కోసం శాశ్వత లోక్ అదాలత్ సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు. నగరంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో గురువారం ప్రజా ప్రయోజిత సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక హక్కులకు ఎటువంటి భంగం వాటిల్లినా ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చన్నారు. సదస్సులో సామాజికవేత్త గేదెల ఇందిరా ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వీడని ఉత్కంఠ

- మూడుచోట్ల అభ్యర్థుల మార్పుపై ప్రచారం
- ఆమదాలవలస, పాతపట్నంలో మార్పు లేనట్టేనా?
- రెండు, మూడు రోజుల్లో మూడో జాబితా ఉంటుందని చర్చ
- సిట్టింగ్‌లు, సమన్వయకర్తల్లో ఆందోళన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వచ్చే ఎన్నికల కోసం వైసిపి ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. అభ్యర్థుల మార్పు, కొత్త సమన్వయకర్తలను నియమిస్తూ రెండుదఫాలుగా జాబితాలను విడుదల చేసింది. ఈనెల రెండో తేదీన విడుదల చేసిన జాబితాలో జిల్లాకు సంబంధించి మార్పులు ఉంటాయని భావించినా, ఎవరి పేర్లూ లేకపోవడంతో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. మూడో జాబితాలో జిల్లాకు సంబంధించిన మార్పులు ఉంటాయని భావిస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఎచ్చెర్ల, టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గ పేర్లు వినిపిస్తున్నాయి. రెండు, మూడు రోజుల్లో మరో జాబితా ఉంటుందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించడంతో ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల్లో ఆందోళన నెలకొంది.

జిల్లాలో అభ్యర్థులను మార్పు చేయనున్న నియోజకవర్గాల్లో ఎచ్చెర్ల పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ స్థానంలో కొత్త సమన్వయకర్తను నియమిస్తారంటూ నియోజకవర్గంలో జోరుగా ప్రచారం సాగుతోంది. విజయనగరం జిల్లా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నా... మజ్జి శ్రీనివాసరావు వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. మజ్జి శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇస్తే అటు వైసిపి కేడర్‌తో పాటు లబ్ధి పొందిన టిడిపిలోని ఓ గ్రూపు ఆయన కోసం పనిచేయొచ్చనే అంచనాలతో అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. ఎచ్చెర్లకు కొత్త సమన్వయకర్తగా చిన్న శ్రీను పేరు ప్రకటిస్తే, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలతో రాజీనామాలు చేయించి తామేమిటో అధిష్టానానికి తెలియజేయాలని గొర్లె కిరణ్ కుమార్ గ్రూపు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



టెక్కలిలో మార్పు తప్పదా?

టెక్కలిలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడుని ఓడించాలని వైసిపి అధిష్టానం ఒకవైపు తీవ్ర ప్రయత్నాలు చేస్తుంటే, అక్కడ పార్టీ పరిస్థితి అంతకంతకూ దారుణంగా ఉంది. తొలుత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్ మధ్య గ్రూపుల పోరు, మధ్యలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి... ఇలా గ్రూపుల పోరుతో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ మూడు గ్రూపులుగా చీలింది. తర్వాత దువ్వాడ కుటుంబంలోని భార్యాభర్తల మధ్య నెలకొన్న విభేదాలు అధిష్టానం దృష్టికి వెళ్లడంతో, దువ్వాడ వాణిని టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. పార్టీ కేడర్ నుంచి పెద్దగా సహకారం లేకపోవడంతో పాటు గ్రూపుల పోరుతో ఆమె ముందుకు వెళ్లలేకపోతున్నారు. దీంతో అక్కడ సమన్వయకర్తను మార్చాలని అధిష్టానం భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.

కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌తో పాటు కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, చింతాడ మంజు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరితోపాటు పౌర సరఫరాల సంస్థ కమిషనర్‌గా పని చేస్తున్న హనుమంతు కృష్ణారావు తనయుడు అరుణ్‌కుమార్ పేరునూ పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అరుణ్‌కుమార్ మరో ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆయన పేరునూ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఇచ్ఛాపురంలో కొత్త పేరు పరిశీలన

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోనూ అభ్యర్థిని మార్చాలని వైసిపి అధిష్టానం భావిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న పిరియా సాయిరాజ్‌ను తప్పించనున్నారనే ప్రచారం సాగుతోంది. నియోజకవర్గంలో కళింగ సామాజిక తరగతికి జెడ్‌పి చైర్‌పర్సన్ పదవి, యాదవ సామాజిక తరగతికి ఎమ్మెల్సీ కేటాయించినందున ఎమ్మెల్యే అభ్యర్థిగా రెడ్డిక సామాజిక తరగతికి ఇస్తే బాగుంటుందని పార్టీ పెద్దలు అధిష్టానానికి సూచించినట్లు తెలిసింది. అందులో భాగంగానే ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి పేరు పరిశీలనకు వచ్చినట్లు తెలిసింది. ఇచ్ఛాపురం టౌన్ తప్ప నియోజకవర్గంలో ఎక్కడా ఆమె ప్రభావం చూపలేరని, ఆమెను నియమిస్తే పార్టీ ఓడిపోతుందని అన్ని మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు కలిసి అధిష్టానానికి లేఖ రాసినట్లు సమాచారం. దీనిపై పార్టీ మరింత కసరత్తు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఆ రెండింటిలో మార్పులు లేనట్టేనా?

పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు ఉంటుందని ఇటీవల జోరుగా ప్రచారం సాగినా, పాత వారినే కొనసాగిస్తారనే చర్చ నడుస్తోంది. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతిపై నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత ఉన్నా అధిష్టానం పాలవలస కుటుంబంపై కొంత సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో వ్యతిరేకత లేకుండా చూసుకోవాలని అధిష్టానం సూచించినట్లు తెలిసింది. అసంతృప్తిని చల్లార్చేందుకు ఉమ్మడి జిల్లా జెడ్‌పి మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖరం గురువారం పాతపట్నంలో సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. ఆమదాలవలస టిక్కెట్‌ను శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకే కేటాయించనున్నారని సమాచారం.

చలో విజయవాడ భగ్నానికి యత్నం

ఎండిఎం గౌరవాధ్యక్షులు మహాలక్ష్మి హౌస్ అరెస్టు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జగనన్న గోరుముద్ద మెనూ ఛార్జీలు పెంచాలని, వర్కర్లు, హెల్పర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం ఈనెల ఐదో తేదీన చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు ప్రభుత్వం ముందస్తు అరెస్టులకు తెరతీసింది. ఇందులో భాగంగా ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మిని నగరంలోని మహాలక్ష్మినగర్ కాలనీలో గల ఆమె నివాసంలో గృహ నిర్బంధం చేశారు. జిల్లావ్యాప్తంగా ఎండిఎం సంఘ నాయకులకు పోలీసులు ఫోన్లు చేసి చలో విజయవాడకు వెళ్లవద్దని హుకుం జారీ చేశారు. అక్రమ అరెస్టును సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఖండించారు.

సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఉద్యమిస్తున్న ఎండిఎం కార్మికుల గొంతు నొక్కే చర్యలు సరికాదన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మహాలక్ష్మి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.పది వేల వేతనం ఇస్తామని ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో జగన్ హామీనిచ్చారని గుర్తుచేశారు. నేటికీ ఆ హామీని అమలు చేయకుండా కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. సమస్యలను పరిష్కరించమంటే అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఓదార్పు.. భరోసా...

- బాధిత కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ
- 'నిజం గెలవాలి' యాత్రకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - ఆమదాలవలస, బూర్జ, జి.సిగడాం

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టుతో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చేందుకు 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా జిల్లాలో గురువారం పర్యటించారు. ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాల్లో టిడిపి కార్యకర్తల కుటుంబాలను గురువారం పరామర్శించి ఓదార్చారు. జి.సిగడాం మండలంలోని ధవళపేటలో కంచరాన అసిరినాయుడు, బూర్జ మండలం తోటవాడలో గేదెల సాంబమూర్తి, ఆమదాలవలస మండలం దన్నానపేటలో గొర్లె తిరుపతిరావు, పాతనిమ్మతొర్లాడలో ఆకేటి పారయ్య, గొండు ఎర్రయ్య కుటుంబాలను పరామర్శించి రూ.మూడు లక్షల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయా కుటుంబాల స్థితిగతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకొచ్చా వారి కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామని హామీనిచ్చారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి

తిరుపతిరావు భార్య రమణమ్మను పరామర్శిస్తున్న భువనేశ్వరి

భువనేశ్వరికి ఘన స్వాగతం

జిల్లా పర్యటనకు వచ్చిన భువనేశ్వరికి టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. షెడ్యూల్ కంటే ఆలస్యంగా ఆమె పర్యటన సాగినా టిడిపి కార్యకర్తలు, మహిళలు ఆమె కోసం వేచి ఉన్నారు. మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకట్రావు, జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, ఎమ్మెల్సీ అనురాధ, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, జనసేన నాయకులు పేడాడ రామ్మోహనరావు, టిడిపి నాయకులు సీతారాం, బాబునాయుడు, పడాల భూదేవి, నూక రాజు తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు దగ్ధం

- 24వ రోజుకు అంగన్వాడీల సమ్మె
- శ్రీకాకుళంలో నేడు ఎం.వి పద్మావతి ఇళ్లు ముట్టడి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 24వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా పలురూపాల్లో నిరసనలు తెలిపారు. కోటబొమ్మాళి, కొత్తూరులో విధులకు హాజరు కాకుంటే చర్యలు తీసుకుంటామని అధికారులు ఇచ్చిన నోటీసులను అంగన్వాడీలు దగ్ధం చేశారు. భయపెడితే బెదిరేది లేదని, సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు హెచ్.ఈశ్వరరావు, యూనియన్ నాయకులు హేమలత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. శ్రీకాకుళం నగరంలో అంగన్వాడీలను బెదిరిస్తూ కేంద్రాలను బలవంతంగా తెరిపిస్తున్న ఎం.వి పద్మావతి నివాసాన్ని శుక్రవారం ముట్టడిస్తామని యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి తెలిపారు. కార్మికుల మధ్య చీలిక తెచ్చి పబ్బం గడుపుకోవాలని చూస్తే సహించేది లేదన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా బెదిరింపులకు పాల్పడితే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలిపారు. ఐద్వా నాయకులు శ్రీదేవి పాణిగ్రాహి, సిఐటియు నాయకులు వెంకటరావు పాణిగ్రాహి కార్మిక చట్టాలు, సమ్మె హక్కుపై వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.రాజేశ్వరి, కె.ప్రమీలాదేవి తదితరులు పాల్గొన్నారు. పలాసలో కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని ఎల్ఐసి యూనియన్ నాయకులు ఎం.హరనాథ్ శ్రీనివాస్ పి.రాంబాబు తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి, సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.మంజుల, బి.సునీత తదితరులు పాల్గొన్నారు. టెక్కలి, ఆమదాలవలసలో ప్రాజెక్టు కార్యాలయాల వద్ద, ఇచ్ఛాపురంలో బస్టాండ్ కూడలి వద్ద సమ్మె శిబిరంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.రమణమ్మ, బి.ఆదిలక్ష్మి సిహెచ్.ఇందుమతి, పి.లతాదేవి, పి.భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పొందూరులో కార్మిక చట్టాలు, సమ్మె హక్కులను సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసు వివరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : నోటీసులను దగ్ధం చేస్తున్న అంగన్వాడీలు

శ్రీకాకుళం అర్బన్ : ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

మిల్లు ముందు నిరసన తెలుపుతున్న రైతులు

రంగు మారిన ధాన్యం తిరస్కరణ

- కొనుగోలు చేయాలని రైతుల నిరసన
- అధికారుల జోక్యంతో కొనుగోలు

ప్రజాశక్తి- పొందూరు

మిచౌంగ్ తుపాను కారణంగా రంగు మారిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోకపోవడంతో మండలంలోని బాతువకు చెందిన కొంచాడ సమీపంలోని లక్ష్మీరాజ్యం రైస్‌మిల్లు వద్ద గురువారం నిరసన చేపట్టారు. బాతువకు చెందిన ఎనిమిది మంది రైతులు 800 క్వింటాళ్ల ధాన్యాన్ని లారీతో బుధవారం మిల్లుకు తీసుకొచ్చారు. అందులో ఒక రైతుకు చెందిన ధాన్యం సుమారు 28 శాతం రంగు మారిందని కొనుగోలుకు మిల్లర్లు తిరస్కరించారు. దీంతో రైతులు మిల్లు వద్ద బైఠాయించి నిరసనకు దిగారు. రంగు మారిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తోందని, మిల్లర్లు మాత్రం కొనడం లేదని వాపోయారు. బాగున్న ధాన్యానికి సైతం అదనంగా నాలుగు కేజీలు తీసుకుంటున్నారని చెప్పారు. విషయాన్ని స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పరిశీలించి జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వగా, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం మిల్లు వద్దకు వచ్చి ధాన్యాన్ని పరిశీలించారు. కొనుగోలు చేయాలని మిల్లరును ఆదేశించడంతో చివరకు ఆ ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

జనసేన జిల్లా అధ్యక్షులుగా చంద్రమోహన్

ప్రజాశక్తి- పొందూరు

జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులుగా మండలంలోని బురిడికంచరాం గ్రామానికి చెందిన పిసిని చంద్ర మోహన్ నియమితులయ్యారు. ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నియామక పత్రాన్ని గురువారం అందజేశారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతను నెరవేర్చి జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు అధికారంలోకి తీసుకువచ్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. చంద్రమోహన్‌కు ఆ పార్టీ జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు.

నియామక పత్రం అందుకుంటున్న చంద్రమోహన్

దున్నపోతుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రెగ్యులరైజ్ తదితర సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి అధ్వర్యాన సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారానికి 16వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా స్థానిక జ్యోతిరావుపూలే పార్కు వద్ద ఉద్యోగులు ప్రభుత్వం స్పందించకపోవడానికి నిరసనగా దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరిని విడనాడి సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై అనుసరిస్తున్న వైఖరిని తప్పుపట్టారు. తక్షణమే న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి సమ్మె విరమింపజేయాలన్నారు. చిన్నారావు మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. ఉద్యోగులకు పనిభారం తగ్గించాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి అధ్యక్షులు పైడి మురళీకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులపై సానుకూల వైఖరి చూపాల్సిన ప్రభుత్వం మొండివైఖరి వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు డి.శ్రీనివాసరావు, గిరిధర్, పోతయ్య, తారక్ తదితరులు పాల్గొన్నారు.

దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

సామాజిక పింఛన్ల పెంపుపై ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురంలో వైఎస్సార్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చెప్పిన విధంగా ఏటా పెన్షన్ పెంచుతూ రూ.మూడు వేలు ఇస్తున్నామన్నారు. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తేనే అన్ని సంక్షేమ పథకాలూ కొనసాగుతాయని చెప్పారు. విపక్ష నేత చంద్రబాబుకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం తెలియదన్నారు. అధికారం వచ్చే వరకు ఒక మాట, వచ్చాక మరో మాట చంద్రబాబు చెప్తారని విమర్శించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన సాగిస్తున్న ఏకైక నేత జగన్ అని కొనియాడారు. ఆర్థిక భారం అయినా సంక్షేమ పథకాల అమలును అడ్డుకున్న దాఖలాల్లేవన్నారు. ఒడిశాతో వివాదం నేపథ్యంలో నేరడి బ్యారేజీ నిర్మాణం ఆలస్యమవుతోందన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా హిరమండలం గొట్టాబ్యారేజీ దగ్గర లిఫ్ట్ ఏర్పాటు చేసి వేసవికి వంశధార నీరు అందించవచ్చని చెప్పారు. ఇందుకోసం సిఎం జగన్ రూ.185 కోట్లు మంజూరు చేశారని, ప్రస్తుతం సంబంధిత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను పెంచిందన్నారు. అటువంటి ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, శ్రీ శయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి దేవ్, ఎంపిపి అంబటి నిర్మల, తహశీల్దార్ వెంకటరావు, వైసిపి మండల అధ్యక్షులు చిట్టి జనార్ధనరావు, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, సర్పంచ్ ఆదిత్య నాయుడు, ఎంపిటిసిలు బగ్గ అప్పారావు, నక్క శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌ను అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

అంధుల ఆరాధ్యుడు బ్రెయిలీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చూపు కోల్పోయినంత మాత్రాన మనోధైర్యం కోల్పోకుండా అంధులు చదువుకునేందుకు వీలుగా లూయిస్ బ్రెయిలీ లిపిని కనుగొన్నారని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ డి.వి.వి.విద్యాసాగర్ అన్నారు. వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో బ్రెయిలీ జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంధుల పాలిట ఆరాధ్యుడు బ్రెయిలీ అని అన్నారు. బ్రెయిలీ లిపి వల్ల చదువుకునే అవకాశం అంధులకు లభించిందన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి కె.కవిత, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ, సిపిఒ ఎల్.ప్రసన్న పాల్గొన్నారు. ఇందులో భాగంగా అంధులు పలు చిత్ర గీతాలను ఆలపించి అందర్నీ ఆకట్టుకున్నారు. అనంతరం అందులకోసం ముద్రించిన వార్షిక కేలండర్‌ను ఆవిష్కరించారు.

అంధుల సంఘం ఆధ్వర్యాన...

లూయిస్ బ్రెయిలీ అంధుల లిపిని 12 నుంచి 6 చుక్కలకి కుదించి అంధుల పాలిట ఆరాధ్యుడయ్యాడని జిల్లా అంధుల సంక్షేమ సంఘం కార్యదర్శి అల్లు రమ అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా హైటెక్ పారడైజ్లోని బొడ్డు శ్రీనివాసరావు స్వగృహంలో జయంతి వేడుకలను నిర్వహించారు. బ్రెయిలీ విద్యార్థిగా ఉన్నప్పుడే అంధులు త్వరగా, సమర్ధవంతంగా చదవడానికి, రాయడానికి అనుమతించే స్పర్శ కోడ్ వ్యవస్థను అభివృద్ధి చేశారని అన్నారు. స్పర్శ కోడ్ వ్యవస్థను అభివృద్ధి చేయడంతో ప్రస్తుతం అంధులు ఉన్నతి స్థితిలో ఉండడానికి ముఖ్య కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బొడ్డు శ్రీనివాసరావు, పి.జగ్గారావు, సిహెచ్.రాంబాబు, పి.రామప్రసాద్, బొడ్డు లక్ష్మి, పి.శారద, గౌతం కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం : అంతర్జాతీయ లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా భవిత కేంద్రంలో ముత్యాలమ్మపేట స్కూల్‌లో ఎంఇఒ కె.అప్పారావు ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.శివకుమార్, ఉదయ్, పావని, ఎస్.సూర్యం, హెచ్.సోమేష్, అరుణ పాల్గొన్నారు.

టెక్కలి : వికలాంగులను ఆదరించాలని ఎంఇఒలు డి.తులసీరావురెడ్డి, ఎస్.చిన్నారావులు కోరారు. స్థానిక భవిత కేంద్రంలో అంధుల లిపి నిర్మాత లూయీ బ్రెయిల్ జయంతి వేడుక నిర్వహించారు. ముందుగా బ్రెయిల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో భవిత కేంద్ర నిర్వాహక కో-ఆర్డినేటర్లు అట్టాడ మన్మథరావు, ఎం.సింహాచలం పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: స్థానిక భవిత కేంద్రంలో లూయి బ్రెయిలీ చిత్రపటానికి ఎంఇఒలు జె.చిన్నవాడు, అర్జునుడు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో స్థానిక లైబ్రేరియన్ రామకృష్ణ, భవిత ఉపాధ్యాయులు, ఫిజియోథెరపిస్టు పాల్గొన్నారు.

KANAKADURGA
FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : #11-2-13, 1st ఫ్లోర్, బియస్ఎన్ఎల్ ఆఫీసు దగ్గర, సూర్య మహల్ ఎదురు, శ్రీకాకుళం-532001
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-01-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 132.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్ఆఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్ఆఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 89779 11633

లక్కీడ్రా తీస్తున్న చిన్నారి

ఆర్‌టిసి సేవలు విస్తృతం

డిపో మేనేజర్ సీతారాం నాయుడు

ప్రజాశక్తి - పలాస

ఆర్‌టిసి సేవలను విస్తృతం చేసేందుకు లక్కీ డ్రా నిర్వహిస్తున్నామని ఆర్‌టిసి డిపో మేనేజర్ రోణంకి సీతారాంనాయుడు అన్నారు. పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద గురువారం మూడు బస్సు రూట్‌లో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి రూట్‌లో పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, మాతల, రెండో రూట్‌లో పొత్తంగి, మూడో రూట్‌లో ఘూటి బస్సులో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు తమ బస్సు టిక్కెట్లను, ఫోన్ నంబర్లను రాశామని అన్నారు. ఇలా ప్రతి 15 రోజులకొకసారి లక్కీ డ్రా తీసేస్తున్నామని తెలిపారు. డ్రాలో ప్రతి రూట్‌లోనూ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో బహుమతులు అందజేస్తామని చెప్పారు. వీరికి లక్కీ షాపింగ్ మాల్ గెలుపొందిన ప్రతి విజేతకూ రూ.వెయ్యి విలువ చేసే కూపన్ ఇస్తామని అన్నారు. వీటిని పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దకు వచ్చి కూపన్లు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లక్కీ షాపింగ్ మాల్ మేనేజర్ శ్రీహరి, ఆర్‌టిసి ట్రాఫిక్ సిఐ పినకాన సంతోష్ కుమార్, ఉద్యోగులు డి.శ్రీనివాసరావు, సి.ఎం.రావు, కామరాజు, ధర్మారావు పాల్గొన్నారు.

విజేతలు వీరే

పాతపట్నం రూట్‌లో మొదటి బహుమతి బి.లోహిత్, ద్వితీయ బహుమతి వి.చిట్టి, ఘూటి రూటులో మొదటి బహుమతి సుజాత, రెండో బహుమతి భాగ్యలక్ష్మి, పొత్తంగి రూట్‌లో మొదటి బహుమతి బి.కురేష్, రెండో బహుమతి చంద్రశేఖర్ దక్కించుకున్నారు.

'ఐతమ్' అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ప్రసన్నకుమార్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న గేదెల ప్రసన్న కుమార్‌కు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ ఇన్ సివిల్లో పిహెర్డి డిగ్రీని మంజూరు చేసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎయు సివిల్ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాజశేఖర్ మార్గదర్శకత్వంలో 'ఎఫెక్ట్ ఆఫ్ కొలెడల్ సిలికా ఆన్ స్ట్రెంగ్త్ అండ్ జ్యూరబులిటీ ప్రోపర్టీస్ ఆఫ్ ఎం-20, ఎం-40 గ్రేడ్స్ ఆఫ్ కాంక్రీట్' అనే అంశంపై ప్రసన్నకుమార్ చేసిన పరిశోధనకు ఆంధ్రా యూనివర్సిటీ పిహెచ్ పట్టాను జారీ చేసిందని అన్నారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆరెన్డీ డాక్టర్ డి.ఆజాద్, సివిల్ హెచ్‌ఐడి డాక్టర్ పి.దినకర్ అభినందించారు.

రైతులను ఇబ్బంది పెడితే మిల్లులు సీజ్

మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసాదరావు

పొందూరు: ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెడితే సంబంధిత మిల్లులపై కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ వై.వి.ప్రసాదరావు పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం అధికారులు, మిల్లర్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలను మిల్లర్లు పాటించాలన్నారు. సమావేశంలో సిఎస్ డిటి వెంకటేష్, మిల్లర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కర్రి రాంబాబు, మిల్లర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై నిర్లక్ష్యం తగదు

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న కృష్ణమూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల పట్ల నిర్లక్ష్య దోరణి అవలంబిస్తోందని, 10 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేక మొద్దు నిద్ర ప్రదర్శించడం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన నిరవధిక సమ్మెలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ శిబిరంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికలకు ముందు చేపట్టిన పాదయాత్రలో, అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాని డిమాండ్ చేశారు. శిబిరాన్ని సందర్శించిన ఆయన సమ్మెకు సంఘీభావం తెలిపారు. తేజేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) కార్మికులందరిని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కారన్నారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి పనికి తగ్గ వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన పోరాటానికి ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి యన్.బలరాం, యూనియన్ నాయకులు కళ్యాణ రాజు, ఆకుల శంకర్, అరుగుల రాము, ఎ.శేఖర్, బి.గణేష్, డి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పలాస : అర్ధనగ్న ప్రదర్శన చేపడుతున్న కార్మికులు

ఆమదాలవలస: పారిశుద్ధ్య కార్మికుల నిరవధిక సమ్మె 10వ రోజుకు చేరుకోవడంతో పట్టణంలో మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద ప్రభుత్వ తీరుకు నిరసనగా మానవహారం నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేస్తూ పట్టణ ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మిక నాయకులు తాడి సంతోష్, కె.తారకేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, జె.శ్రీను పాల్గొన్నారు.

పలాస : సిఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు గురువారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద పదో రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముందుగా కాశీబుగ్గ గాంధీ విగ్రహం నుంచి పలాస మున్సిపల్ కార్యాలయం వరకు పారిశుద్ధ్య కార్మికులు అర్ధనగ్నంగా ర్యాలీ చేపట్టారు. కార్యాలయం ఎదురుగా ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, శ్రీనివాసరావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మురగన్, ఎం.రవి, దివాకర్, ఎస్.శంకర్, తిరుపతి, ప్రకాష్ ముఖి, సీతమ్మ, గులాబీ, సావిత్రి, లక్ష్మి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : రాస్తారోకో చేస్తున్న కార్మికులు

ఇచ్ఛాపురం : పది రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం తమ డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమేష్ కుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు

సామాజిక భద్రతకు భరోసా

ప్రజాశక్తి - బూర్జ

ఇతర రాష్ట్రాలకు ఆదర్శవంతంగా నిలుస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు కింద సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తుందని, ఈ క్రమంలోనే పింఛను మొత్తాన్ని రూ.3000కు పెంచడం ద్వారా వృద్ధులకు, వికలాంగులకు సామాజిక భద్రతకు మరింత భరోసా కల్పిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జ మండలం కొల్లివలసలో రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో మండలానికి చెందిన లబ్ధిదారులకు పింఛను కానుకను గురువారం అందజేశారు. వృద్ధులకు, వితంతువులకు, చేనేత కార్మికులకు, మత్స్యకారులకు, డప్పు కళాకారులకు ఇలా 17 కేటగిరీలకు పింఛను అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి కర్నేన దీప, మండల పార్టీ అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పెంచిన పింఛన్ కానుకను ఎమ్మెల్యే రెడ్డి శాంతి అందజేశారు. అనంతరం సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, తహశీల్దార్ పి.సరోజిని, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లానా బాలరాజు, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, ట్రై కార్ డైరెక్టర్ సవర సుభాష్, ఎపిఎం లలిత పాల్గొన్నారు.

బూర్జ : పింఛను పంపిణీ చేస్తున్న స్పీకర్ సీతారాం

మెళియాపుట్టి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

టెక్కలి రూరల్ : స్థానిక పంచాయతీ కార్యాలయంలో పింఛను కానుకను టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అట్లా సరోజనమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసిలు కూన పార్వతి, పీత హేమలత, మండల సచివాలయం కన్వీనర్లు శిగిలిపల్లి మోహనరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఎంపిడిఒ కార్యాలయంలో పింఛను కానుకను టెక్కలి వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్, వైస్ ఎంపిపి బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండల పరిషత్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి పింఛను కానుకను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తం, సల్ల దేవరాజ్, కారంగి మోహనరావు, ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.

పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి గాంధీ నగర్, సచివాలయం తిలక్ నగర్, చినబడాం, అంతరకూడ్డ పెసరపాడులో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు పింఛను కానుకను పంపిణీ చేశారు. ముందుగా సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, కౌన్సిలర్లు సనపల సింహాచలం, కౌన్సిలర్ ప్రతినిధి బల్ల శ్రీను, దువ్వాడ రమణ పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలో వల్లభరావుపేటలో నూతన పింఛన్ల పెంపును వైసిపి జిల్లా మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ గురాన తిరుమల మానస పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ మహంతి సత్యనారాయణ, గడి సత్యం, గురాన చిరంజీవి, గడి రమణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న దువ్వాడ వాణి

పాఠశాల భవనానికి నిధులు మంజూరు చేయాలి

సరుబుజ్జిలి : మండలంలోని రావివలసలో గల ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని, నూతన భవనానికి నిధులు మంజూరు చేసి విద్యార్థులను ఆదుకోవాలని స్పీకర్ తమ్మినేని సీతారాంకు రావివలస గ్రామస్తులు విన్నవించారు. గురువారం పాలవలస గ్రామ సచివాలయ పరిధిలో రావివలస, రావివలస కాలనీ, చిన్న వెంకటాపురం గ్రామాల్లో సర్పంచ్ వండాన కృష్ణ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పీకర్ పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాల వద్దకు స్పీకర్ రాగానే పాఠశాల పిఎంసి చైర్మన్ అదపాక చంద్రశేఖరరావు, సర్పంచ్ కృష్ణ స్పీకర్‌కు పాఠశాలను, పాఠశాల లోపల భాగం, వంట శాల చూపించారు. భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయని స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపిపి కెవిజి సత్యనారాయణ, జెడ్‌పిటిసి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చోరీకి గురైన ట్యాప్‌లు

'నాడు-నేడు' సామగ్రి చోరీ

ప్రజాశక్తి - పలాస

మండలంలోని పండాశాసనం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం రాత్రి నాడు-నేడు సామగ్రి దొంగిలించారు. పండా శాసనం ప్రభుత్వ పాఠశాలలో రూ. 8 లక్షల వ్యయంతో నిర్మించిన అధునాతన మరుగుదొడ్లలోని ఖరీదైన ట్యాప్‌లు, పైపులు, ఇతర గృహోపకరణాలను దొంగిలించారు. ఉదయానికి ట్యాంక్‌ల్లో నీరంతా ఆరుబయటకు రావడంతో గమనించిన గ్రామస్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుసక రామారావుకు సమాచారం అందజేశారు. పాఠశాల సమయానికి ముందే వచ్చిన ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రుల కమిటీ చైర్మన్ రాజాం కూర్మారావుతో కలిసి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. గురువారం మధ్యాహ్న భోజన వంటకు, చిన్నారులు మరుగుదొడ్లకు తాగునీరు అందుబాటులోకి రాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. పండాశాశనం హరిజనవీధి నుంచి తాగునీటికి తీసుకొచ్చి సర్దుబాటు చేశారు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు.

బంగారం గొలుసు అపహరణ

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

జెఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధి పతివాడపాలేం గ్రామంలో బిజెపి నాయకులు మహంతి కృష్ణ సోదరి పతివాడ లక్ష్మి గురువారం పొలం పనులు చేసుకుని ఇంటికి వస్తున్న సమయంలో మెడలో రెండు తులాల బంగారు ఆభరణాన్ని బైక్‌పై వచ్చి ఇద్దరు గుర్తు తెలియని దుండగులు అపహరించారు. వెంటనే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం క్రైమ్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

జయహో బిసి సభలో మాట్లాడుతున్న శిరీష

జయహో బిసి సభలో శిరీష

పలాస: టిడిపి బిసిలకు అండగా ఉండడమే కాకుండా ఉన్నత పదవులు కట్టబెట్టిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మంగళగిరి జయహో బిసి కార్యక్రమంలో మాట్లాడుతూ బిసిలు అంటే బ్యాక్వర్డ్ క్లాసెస్ కాదు బ్యాక్ బోన్ క్లాసెస్ అనే మాటని అక్షరాల అమలు పరుస్తున్న ఏకైక పార్టీ టిడిపి అన్నారు. బిసిలు అంటే వెనుకబడిన తరగతులు కాదని, పార్టీని వెన్నంటే ఉండి వెన్నెముకగా నడుస్తున్న కులాలు అని పేర్కొన్నారు. టిడిపి గెలుపుకు ప్రతిఒక్కరూ నడుము బిగించి రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

భువనేశ్వరిని కలిసిన నాయకులు

పుష్పగుచ్ఛం అందజేస్తున్న టిడిపి నాయకులు

వజ్రపుకొత్తూరు : జిల్లాకు విచ్చేసిన చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని టిడిపి మండల నాయకులు బూర్జ మండలం తోటాడ వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు పుచ్చ శోభారాణి, క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు బత్తిన హేమ, ఎస్.మోహనరావు, కర్ని రమణ, ఎ.ఉమామహేశ్వరరావు, కొన్ని ఢిల్లేశ్వరి, చంద్రకళ, నెయ్యిల శాంతి, కీర్తి, జ్యోతి, సంధ్య, శేషు పాల్గొన్నారు.

దొంగల చేతివాటం

బూర్జ: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి గురువారం మండలంలో తోటవాడలో గేదెల సాంబమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ అభిమానులు, ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చారు. ఇదే అదునుగా దొంగలు హల్‌చల్ చేశారు. తమ చేతులకు పని కల్పించారు. జనంలోకి దూరి జేబుల్లో పర్సులను మాయం చేశారు. పది మందికిపైగా పర్సులను పోగొట్టుకున్నారు. సుమారు రూ.30 వేలకుపైగా దొంగలు కొట్టేశారని తెలుస్తుంది. ఇదే విషయాన్ని ఎస్‌ఐ అశోక్‌బాబు వద్ద ప్రస్తావించగా దొంగలు గుంపులో చేరి జనాల పర్సులు దొంగతనానికి పాల్పడ్డారన్నారు. దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వర్సిటీ పోటీలకు బిఆర్‌ఎయు క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

డా. బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ తరఫున సౌత్‌జోన్ అంతర్‌వర్సిటీ పోటీలకు క్రికెట్ జట్టు ఎంపికలు గురువారం ముగిశాయి. రెండురోజుల పాటు శివాని ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఈ ఎంపికలు జరిగాయి. 'వర్సిటీ పరిధిలో 28 కళాశాల నుంచి 89 మంది విద్యార్థులు ఈ ఎంపికలకు హాజరుకాగా మొదటిరోజు 22 మందిని ఎంపిక చేశారు. గురువారం జరిగిన తుది పోటీల్లో గెలిచిన జట్టును అంతర్ వర్సిటీ పోటీలకు ఎంపిక చేశారు. చెన్నైలోని హిందుస్థాన్ డీమ్డ్ యూనివర్సిటీలో ఈ నెల 7 నుంచి 15 వరకు జరిగే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ స్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుంది. జట్టు సభ్యులకు వర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, స్పోర్ట్స్ అసిస్టెంట్ డీన్ డా.బి.వి.రమణమూర్తి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా.ఎం.శ్రీనివాస్, అధ్యాపకులు డా. ఎ.భాస్కర్ అభినందనలు తెలిపారు.

క్రికెట్ జట్టును అభినందిస్తున్న రిజిస్ట్రార్, అధ్యాపకులు

తెలుగు మహాసభలకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఈనెల 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరగనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో పాల్గొని కవితా గానం చేసేందుకు పట్టణానికి చెందిన కుప్పిలి వెంకట రాజారావు, కర్నేన జనార్దనరావులకు ఆహ్వానం వచ్చింది. గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యా సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభల్లో ఇరువురు కవులు తమ కవితలను వినిపించనున్నారు.

దేశ, విదేశాలకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు, సినీ, సాహిత్య రంగ ప్రసిద్ధులు పాల్గొననున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనే అవకాశం పొందిన ఈ కవులకు పట్టణానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

బిందెను తలపైకి ఎత్తుతున్న చైర్మన్ గిరిబాబు

పవర్ బోర్ ప్రారంభం

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి చినబడాంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందించి సొంత నిధులతో పవర్ బోర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తాగునీటి సమస్య ఉండదని, తాగునీరు సౌకర్యం కల్పించేందుకు మంత్రికి మున్సిపాలిటీ తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సనపల సింహాచలం, కౌన్సిలర్ ప్రతినిధి రమణ పాల్గొన్నారు.

భూహక్కు చట్టాల మార్పుతో పేదలకు అన్యాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

భూహక్కు చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నామని గొప్పగా చెబుతున్న రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఈ మార్పుల వల్ల పేదలకు నిలువునా ముంచే ప్రయత్నాన్ని బయటపెట్టాలని మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం అరసవల్లిలో ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. భూసమగ్ర చట్టం తెస్తామని నమ్మబలికి నిలువునా ముంచే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తిరోగమన చర్యగా ప్రజలు గమనించాలన్నారు. భూమి తాలూకా టైటిల్ చట్టాన్ని తీసుకు రావడం వల్ల అన్యాయం జరిగినా న్యాయస్థానానికి వెళ్లే అవకాశాన్ని భూహక్కుదారులు కోల్పోవాల్సి వస్తుందన్నారు. జ్యూడిషియల్ వ్యవస్థ స్కోప్ పూర్తిగా తగ్గించి సీనియర్, సివిల్, జూనియర్ జిల్లా కోర్టులను కాదని జిల్లాకు ఒక ట్రిబ్యునల్ పెట్టి పేదలకు అన్యాయం చేసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు.

ఈచట్టం లోతును గ్రహించిన అన్ని వర్గాల ప్రజలు, న్యాయవాదులు ఆందోళన చేస్తుంటే ఈమార్పు ఎంతో గొప్పదని మంత్రి చెప్పడం సిగ్గుచేటన్నారు. కమ్యూనిస్టులు సైతం దీనిని నల్ల చట్టమని, వివాదాస్పదమైన చటమని ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ చట్టం పూర్తిగా రెవెన్యూ చట్టమని, దీనికి రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పిఎంజెబాబు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

టెక్కలి : విశాఖపట్నంలో బాలిక గ్యాంగ్ రేప్‌పై సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు బోకరా నారాయణరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన బాలికపై విశాఖపట్నం నడిబొడ్డున జరిగిన ఈ ఘటన సభ్య సమాజానికే సిగ్గుచేటు అన్నారు. జరిగిన ఘటనకు పోలీసులు నైతిక బాధ్యత వహించాలన్నారు. బాధితురాలు తల్లిదండ్రులు ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేసిన మిస్సింగ్ కేసు కింద నమోదు చేసి నిర్లక్ష్యం చేయడం వల్లే బాలిక గ్యాంగ్ రేప్ గురికావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు.

నందిగాం: రాష్ట్రంలో బాలికలు అత్యాచారానికి గురవుతున్నా పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు భావిస్తుందన బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బి.నారాయణరావు ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. ఎస్‌సిలపై దాడులు, అత్యాచారాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖలో సామూహిక అత్యాచారానికి గురైన బాలికను కాపాడుటలో పోలీసులు, ప్రభుత్వం విఫలమైందని అన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - కవిటి

ఆర్థిక సమస్యలతో ఉన్నత చదువులకు ఇబ్బంది పడుతున్న కవిటికి చెందిన నర్సిపురం అవినాష్‌ను చింతామణి ట్రస్టు దత్తత తీసుకుంది. ఈ మేరకు స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, చింతామణి ట్రస్టు సభ్యుల చేతుల మీదుగా గురువారం విద్యార్థి కుటుంబ సభ్యులకు రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థుల చదువుకు చేయూత అందిస్తున్న చింతామణి అమ్మవారి ట్రస్టు సేవలు అభినందనీయమని కొనియాడారు. అటువంటి ట్రస్టు ఇప్పుడు మరో అడుగు ముందుకేసి కవిటికి చెందిన నర్సిపురం అనే ఇంజినీరింగ్ నిరుపేద విద్యార్థి చదువు పూర్తిచేసే వరకు బాధ్యత తీసుకోవడం ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ శేఖర్, మాజీ సర్పంచ్‌లు ఆరంగి మధు, బెందాళం వెంకటేశ్వరరావు, ఆగ్నికుల క్షత్రియ సంఘం నాయుడు పొల్లాయి లక్ష్మణమూర్తి, ఆరంగి రాజు, భావన రవి, జన్ని లోకనాథం, బాలక శ్రీను, పొల్లాయి ఉమా మహేశ్వరరావు, పి.అప్పారావు, పి.సింహాచలం పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

షర్మిల చేరికతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం

ప్రజాశక్తి - ఆమదాలవలస

దివంగత మాజీ సిఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరికతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం కేంద్ర పార్టీ కార్యాలయంలో జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, జాతీయ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాహుల్ గాంధీ సమక్షంలో షర్మిల కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడం ఎపిలో కాంగ్రెస్ పార్టీకి ఉత్తేజం కలిగిందన్నారు.

ఆమె రాకతో పార్టీలో వలసలు పెరుగుతాయన్నారు. షర్మిల నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరం కలసికట్టుగా పనిచేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

రణస్థలం రూరల్: వైఎస్ఆర్ తెలంగాణ పార్టీని కాంగ్రెస్‌పార్టీలో విలీనం చేసిన వైఎస్ షర్మిల అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా షర్మిల చేరిక పట్ల ఎచ్చెర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రి నాయుడు, పిసిసి డెలిగేట్ కె.లక్ష్మీ, ఎం.గణేష్, కె.జోగినాయుడు, ఎ.జగదీష్ నాయుడు, వై.సూర్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ

ఇచ్ఛాపురం : గ్రామ సంఘాల మహిళలకు వెలుగు ఎపిఎం ప్రసాదరావు గురువారం శిక్షణ ఇచ్చారు. పచ్చదనం పరిశుభ్రత, సంఘ రుణాలు ఉపయోగించుకునే విధానం, ఆస్తులు కొనుగోలు, బీమా సౌకర్యం ఉపయోగించుకోవడం, సంఘం ప్రణాళికలు తయారీ వాటిని అమలు చేసుకునే విధానం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సిసి మోహనరావు, అకౌంటెంట్ మోహిని, విష్ణుబాబు, మండల సమైక్య అధ్యక్షులు డి.పార్వతి పాల్గొన్నారు.

రీ సర్వేపై గ్రామసభ

ప్రజాశక్తి - నందిగాం

మండలంలోని నౌగాంలో తహశీల్దార్ వై.వి.పద్మావతి అధ్యక్షతన భూ రీ సర్వేపై గురువారం గ్రామసభ నిర్వహించారు. త్వరలో గ్రామంలో చేపట్టనున్న రీ సర్వే గ్రామస్తులంతా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఆర్‌ఒ రవిశంకర్, పండ, ఎంపిటిసి బి.బాల కృష్ణ, కార్యదర్శి జ్యోత్స్న, డివిజనల్ సర్వేయర్ భాస్కరరావు, రామారావు పాల్గొన్నారు.

416 పశువులకు టీకాలు

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు పంచాయతీ బంజీరుపేట, యరకయ్యపేట, ఎలమంచిలి, చిన్న వెంకటాపురం, పెద్ద బమ్మిడి, జగన్నాథపురం గ్రామాల్లో 416 పశువులకు గురువారం సామూహిక గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకాలను వేశామని పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పశువులకు ఉచితంగా అందజేస్తున్న గాలికుంటువ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు పశువులకు తప్పనసరిగా వేయించుకోవాలని సూచించారు. నాలుగు నెలల దూడల నుంచి అన్ని వయసు పశువులకు వేసుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో తిలారు పశు వైద్యాధికారి ఎం.ప్రజ్ఞచైతన్య, పశువైద్య సిబ్బంది కుటికుప్పల ముకుందరావు, బలరాం, బాలయ్య, శోభ నారాయణరావు పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి కిరణ్‌కుమార్

జర్నలిస్టుల సంఘ అధ్యక్షునిగా 'పేడాడ'

ప్రజాశక్తి - ఆమదాలవలస

పూర్ణచంద్రరావు

పట్టణం, మండల పరిధిలో ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా జర్నలిస్టుల సంఘ అధ్యక్షునిగా పేడాడ పూర్ణారావును ఎన్నుకున్నారు. గురువారం పట్టణంలో ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు పూర్ణారావుతో పాటు ఉపాధ్యక్షునిగా సనపల శ్రీనివాసరావును జర్నలిస్టులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పూర్ణారావు మాట్లాడుతూ తనకు జర్నలిస్టులందరూ కలిసి ఏకగ్రీవంగా బాధ్యతలను అప్పగించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మరికొద్ది రోజుల్లో పూర్తిస్థాయి సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శంకర్, నందు, సనపల చంద్రశేఖర్, గురుగుబెల్లి ప్రసాద్, జగ్గు నాయుడు, సనపల రాజు, రామ్మోహనరావు, మోహన్ పాల్గొన్నారు.

పుస్తకాలను పంపిణీ చేస్తున్న ప్రశాంత్‌కుమార్

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

కొత్తూరు : ఇటీవల ప్రభుత్వం గ్రూప్-2, డిప్యూటీ డిఇఒ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆ ఉద్యోగాల్లో విజేతలుగా సాధించేందుకు అవసరమయ్యే పుస్తకాలను మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు అంపిలి ప్రశాంత్‌కుమార్ స్థానిక శాఖాగ్రంథాలయానికి గురువారం అందజేశారు. ఎస్అండ్ఎస్ పబ్లికేషన్స్ సంబంధించిన ఈ పుస్తకాలు అత్యంత ప్రామాణికమైనవని అన్నారు. కార్యక్రమంలో కర్లెమ్మ మాజీ సర్పంచ్ పడాల వెంకటకృష్ణ, కొండపల్లి దివాకర్ పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణ

ఎచ్చెర్ల : మండలం భగీరధపురం, ధర్మవరం, కొంగరాం, ఎచ్చెర్ల గ్రామాల్లో ఎంపిపి మొదలవలస చిరంజీవి గురువారం పర్యటించారు. వైసిపి జెండా, శిలాఫలకాలను ఆవిష్కరించారు. మండల విప్ బగ్గు రాజారావు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ నక్క కృష్ణమూర్తి, సర్పంచ్ గుండ రవి, వైసిపి నాయకులు నేతింటి సత్యనారాయణ, అబోతుల నరసింగరావు, అల్లు సూర్యనారాయణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకుడిలా మాట్లాడం సరికాదు

ప్రజాశక్తి - విజయనగరం కలెక్టరేట్

సమగ్ర శిక్ష అభియాన్ కెజిబివి టీచర్ల సమ్మెకు సంబంధించి ఎస్‌పిడి చేసిన వ్యాఖ్యలు రాజకీయ నాయకులను మరిపిస్తున్నాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన రావు అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతున్నారు తప్ప ఇప్పుడు కొత్తగా కోరిన కోర్కెలు కావని అన్నారు. సమ్మెలో ఉన్న టీచర్లను, ఉద్యోగులను పిలిచి ప్రజాస్వామ్యయుతంగా చర్చించి సమస్యలను పరిష్కరించాలి తప్ప బెదిరించడం సరికాదని అన్నారు. అలాగే సమ్మెలో ఉన్న వారిని తొలగిస్తామని చెప్పడం మానవత్వం లేని వారి మాటలని అన్నారు. ఇప్పటికైనా బెదిరింపులు మాని, సమస్యలను పరిష్కరించాలని, లేనిచో ఉపాధ్యాయ సంఘాలన్నింటితో కలిపి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు.

షర్మిల నాయకత్వం అవసరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు షర్మిల నాయకత్వం అవసరం ఉందని భావించిన కాంగ్రెస్ అగ్ర నాయకులు మల్లికార్జున కార్గే, రాహుల్ గాంధీ కాంగ్రెస్‌లో చేర్చడం ద్వారా పూర్వవైభవం రావడానికి అవకాశం ఉందని డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాచలం అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరడం శుభ పరిణామమన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీని ఇంటికి పంపించాలంటే షర్మిల నాయకత్వం అవసరమన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ తప్పక విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తపరిచారు. సమావేశంలో జిల్లా గిరిజన విభాగ అధ్యక్షులు కె.రాఘవేంద్రరావు, మండల అధ్యక్షులు మూటక లక్ష్మయ్య, నాయకులు సూర్యం పాల్గొన్నారు.

గాలికుంటువ్యాధి నివారణకు టీకాలు

గరుగుబిల్లి: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా శుక్రవారం నుంచి గాలి కుంటువ్యాధి టీకాల కార్యక్రమం ప్రారంభించనున్నామని మండల పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని ఉల్లిభద్ర పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గాలికుంట వ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమన్నారు. అలాగే గాలికుంటు వ్యాధి నివారణకు సంబంధించిన పశువులకు టీకాలు వేయడం ఎంతో ఉపయోగమని, అదేవిధంగా వ్యాధి సోకిన పాడి పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చునన్నారు.

దశమంతపురంలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం: మండలంలోని దశమంతపురంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులతో పాటు తదితర రకాల రోగులను తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.లలిత, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

అంటిపేటలో వికసిత్ భారత్

సీతానగరం: మండలంలోని అంటిపేటలో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు. వైద్య సేవలు, గ్యాస్ పథకం, కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న వైద్య సేవలు గూర్చి వివరించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో కేలండర్లును ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కుమార్ వర్మ, సర్పంచ్ బొంగు తిరుపతిరావు, ఎంపిటిసి తిరుపతిరావు, సెక్రటరీ శశిభూషణరావు, సచివాలయం సిబ్బంది, పలు శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

బిసి సదస్సుకు టిడిపి నాయకులు

గుమ్మలక్ష్మీపురం: విజయవాడలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బిసి సదస్సుకు జియమ్మవలస మండలం నుంచి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, క్లస్టర్ జోగి భుజంగరావు, నాయకులు యలకల రాంబాబు హాజరయ్యారు.

బాల్య వివాహ నిరోధ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జండర్ అవగాహన సూచనల మేరకు బేటి బచావో బేటి పడావో ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు సమాజంలో ఆడపిల్లలందరిని రక్షిద్దాం - అమ్మాయిలందరిని చదివిద్దాం కార్యక్రమం గురువారం పట్టణంలో మహిళా సమాఖ్య కార్యాలయంలో సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ క్రాంతిపథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు మాట్లాడుతూ బాల్యవివాహ నిరోధ చట్టం 2006పై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వలన అనర్థాలను, కుటుంబం, పాఠశాలల్లో, సమాజంలో పిల్లలహక్కులపై వివరించారు. ఇంటిగ్రేటెడ్ లీగల్, చైల్డ్ ప్రొటెక్షన్ సిబ్బంది లక్ష్మణరావు అనధికార దత్తత, బాలకార్మికుల సంరక్షణపై అవగాహన కల్పిస్తూ టోల్ ఫ్రీ నెంబర్లు 1098, 100, 112 దిశ రక్షణ కోసం ఫోన్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఔట్రీచ్‌పర్సన్ శ్రీనివాసరావు, మౌనిక, మండల మహిళా సమాఖ్య అకౌంటెంట్ కళ్యాణి, కార్యదర్శి వేణమ్మ, ఉపాధ్యక్షులు ఉషారాణి, కోశాధికారి రేణుక, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, గ్రామ సంఘాల అధ్యక్షులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ఉద్దానం యూత్ క్లబ్

సర్పంచ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- కవిటి

బొరివంక కేంద్రంగా పనిచేస్తున్న ఉద్దానం యూత్ క్లబ్ సామాజిక సేవలో ఆదర్శంగా నిలుస్తోందని సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్ అన్నారు. ఉద్దానం యూత్ క్లబ్ నూతన భవనాన్ని ఎంపిటిసి దుద్ది సతీష్ కుమార్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఉద్దానం యూత్ క్లబ్ ద్వారా గ్రామ యువత ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ గ్రామానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారని కొనియాడారు. అనంతరం శ్రీరాంప్రసాద్ జన్మదిన వేడుకలు సందర్భంగా యూత్‌క్లబ్ ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మి, కామేశ్వరరావు, గెస్ట్ అధ్యక్షుడు శంకరరావు, విశ్రాంతి ఉపాధ్యాయులు రంగనాథం, బల్లెడ జయప్రకాష్ పాల్గొన్నారు.

పరీక్షలపై భయాన్ని పోగొట్టాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పదో తరగతి విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలపై భయాన్ని పోగొట్టాలని ఎంఇఒ కె.అప్పారావు అన్నారు. మండలంలోని ఈదుపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని అన్నారు. అనంతరం పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.రామారావు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న ఎంఇఒ అప్పారావు

అలరించిన బాలోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

బాలోత్సవంలో భాగంగా స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, స్పెల్ బి క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జానపద నృత్యాలు అందరినీ ఆకట్టుకు న్నాయి. అనంతరం పోటీల్లో గెలిచిన అభ్యర్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బాలో త్సవ నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస రావు మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను, కళలను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని మొట్ట మొదటిసారిగా విజయనగరంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆహ్వాన సంఘం గౌరవ సభ్యులు డోల మన్మథకుమార్, చైర్మన్ దవళ సర్వేశ్వర రావు, అధ్యక్షులు ఎస్ఎస్ఎస్ఎస్ రాజు బహుమతులు అందజేశారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

గులి రాగి విధానాన్ని విస్తరించాలి

పాచిపెంట: రైతులకు రెండింతల ఆదాయాన్ని ఇచ్చే గులిరాగి విధానాన్ని విరివిగా తెలియజేసి ఈ విధానాన్ని విస్తరింప చేయాలని ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర సలహాదారు దేవుళ్లు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రకతి వ్యవసాయ సిబ్బంది రీజినల్ స్థాయి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ సరిగ్గా పండిస్తే ఖర్చులు పోనూ ఎకరాకు రూ.60 వేలకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నందున ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తప్పనిసరిగా గులి రాగి పద్ధతిని ప్రోత్సహించాలని సూచించారు. అలాగే తక్కువ నీటితో అధిక ఆదాయాన్ని ఇవ్వడమే కాకుండా పోషక సంక్షోభాన్ని నివారించే దిశగా చిరుధాన్యాలను ప్రోత్సహించాలని అన్నారు. రీజనల్ వ్యవసాయ అధికారి కె.ప్రకాష్ సమీక్షను నిర్వహిస్తూ క్యాడర్ తప్పనిసరిగా రైతులకు ప్రకృతి వ్యవసాయంతో రాబోయే ఖరీఫ్ సీజన్లో ప్రకృతి వ్యవసాయాన్ని సాలూరు డివిజన్ పరిధిలో విస్తరింప చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలో వివిఎలతో కలిసి పనిచేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం రాజీలేని సూత్రాలను పాటించాలని తెలిపారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముఖరాజు మాట్లాడుతూ క్లస్టర్లను ఏర్పాటు చేసుకుంటూ గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను రైతు భరోసా కేంద్రాల స్థాయిలో రైతులకు తెలియజేయాలన్నారు. ముందుగా కేడర్ అంతా తమ సొంత క్షేత్రాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని పాటించాలని, వాటి ఫలితాలను రైతులకు తెలియజేయాలని కోరారు. తొలుత మాతుమూరు, గోగాడవలసలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను వివిధ రకాల ప్రకృతి వ్యవసాయ పంటల నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో రీజినల్ వ్యవసాయ అధికారి శ్యాంసుందర్, వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజేష్‌ను సన్మానిస్తున్న రియల్టర్లు

రాజేష్‌కు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జెఎన్‌టియు (విజయనగరం) సిండికేట్ మెంబరుగా నియమితులైన బుడుమూరు రాజేష్‌ను శ్రీకాకుళం కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా చాప్టర్ ఆధ్వర్యాన దుశ్శాలువ కప్పి సన్మానించారు. నగరంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో చాప్టర్ అధ్యక్షులు చక్రవర్తి, అదీప్ రెడ్డి, సుధాకర్, నాగేశ్వరరావు, సత్యారావు, కళ్యాణ్ పాల్గొన్నారు.

రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న రమణమ్మ

ఉప సర్పంచ్ రాజీనామా

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో దూసి గ్రామ పంచాయతీ వైసిపి ఉపసర్పంచ్ కంచరాన రమణమ్మ తన పదవికి రాజీనామా చేశారు. గురువారం ఆమె తన రాజీనామా పత్రాన్ని దూసి గ్రామ సచివాలయ కార్యదర్శి మీసాల ప్రసన్న లక్ష్మికి అందించారు. వైసిపిలో తనకు తగిన గౌరవం లేకపోవడం, గ్రామ అభివృద్ధికి సర్పంచ్, నియోజకవర్గ నాయకులు కూడా సహకరించడం లేదని, అందుకే ఆమె రాజీనామా చేసి ఉంటుందని పలువురు చర్చించుకుంటున్నారు.

చలి పులి

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో చలి వణికిస్తోంది. ఉదయం, సాయంత్రం ఆరు గంటల దాటితే చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో మహిళలు మంటలు వేశారు. కాశీబుగ్గ వెంకటేశ్వర కాలనీలో మంటలు వేస్తూ చలి కాపు కుంటున్నారు.

ఎస్‌సిల అభ్యున్నతికి కృషి

కోటబొమ్మాళి: ఎస్‌సిల అభ్యున్నతికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని వైసిపి సెల్ సెల్ విభాగం కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు బోనేల ఎల్లయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సిఎం తనపై నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టారని, అందుకు అతను రుణపడి ఉంటానని అన్నారు. ఎల్లయ్య ఎంపికపై పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, బలగ సూర్యారావు అభినందించారు.

మాజీ మంత్రి పరామర్శ

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు విలేకరి పల్లేటి మోహనరావు తల్లి బాపనమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శివాజీ మోహనరావును గురువారం పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు టిడిపి జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి సాంబమూర్తి, డోకులపాడు మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ ఉన్నారు.

పరామర్శిస్తున్న శివాజీ